

సాక్షి
పల్నాడు
గురువారం । 2 । మార్చి । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 547.70 అడుగుల వద్ద ఉంది. మొత్తం ఔట్‌ఫ్లోగా 50,121 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.



నేడు దుర్గమ్మకు స్వర్ణ పుష్పార్చన

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మకు గురువారం సాయంత్రం 4 గంటలకు స్వర్ణ పుష్పార్చన జరుగుతుంది. ఆలయంలో మూలవిరాట్‌కు నిర్వహించే ఈ పూజలో భక్తులను పరిమిత సంఖ్యలో అనుమతిస్తారు.



బాలికలకు ఆత్మ రక్షణలో శిక్షణ

విజయవాడ స్పోర్ట్స్: రాణి ఝాన్సీలక్ష్మీబాయ్ బాలికల ఆత్మ రక్షణ ప్రశిక్షణ్ తరగతులు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం ప్రారంభమయ్యాయి.

మైనర్ల పైశాచికం

- గుంటూరు నగరంలో రెండు హత్యలు
- రెండు చోట్లా వాచ్‌మెన్లపై ఇనుప రాడ్డుతో దాడి
- యమహా షోరూంలో చోరీ
- మరో నాలుగు షాపుల్లో దొంగతనం
- దిన పత్రికల ఏజెంట్‌పై దౌర్జన్యం
- పట్టుకునేందుకు వచ్చిన పోలీసులపై ఎదురుదాడి



యమహా షోరూం వద్ద హత్యకు గురైన వాచ్‌మెన్ కృపానిధి (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)



సాంబశివరావు మృతదేహం వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

ఇద్దరు మానవ మృగాల పైశాచికత్వానికి గుంటూరు నగరం వణికిపోయింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత హత్యలు, దోపిడీలతో ఇద్దరు దొంగలు నగరంలో బీభత్సం సృష్టించారు. దొంగలు రెండు హత్యలు, పలు దోపిడీలతో స్వైరవిహారం చేశారు. అడ్డు.. అనుకున్నవారిని నిర్దాక్షిణ్యంగా హతమారుస్తూ దోపిడీలకు పాల్పడ్డారు. ఈ భయానక ఘటనలు నగరవాసులను తీవ్ర ఆందోళనకు గురిచేశాయి. చివరకు పోలీసులు ఈ కేసులను పన్నెండు గంటల్లోనే ఛేదించారు. హంతకులు మైనర్లు కావడంతో జువైనల్ హోంకు తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

గుంటూరు రూరల్: ఐపీడీ కాలనీ బావాజీనగర్ 6వ లైనుకు చెందిన శ్రీరాం కృపానిధి (66) జీఆర్‌పీ కానిస్టేబుల్‌గా పని చేసి నాలుగేళ్ల క్రితం రిటైరయ్యారు. ఇంటి నిర్మాణం, పిల్లల పెళ్లిలతో అప్పులు కాగా పింఛన్‌తో బతకటం కష్టమై ఏడు పదుల వయసు దగ్గరపడుతున్నా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. అమరావతి రోడ్డు జ్వరాల ఆసుపత్రి వద్ద ఈ నెల 3వ తేదీ నూతనంగా ప్రారంభించనున్న ఓ ద్విచక్ర వాహన షోరూంలో పది రోజుల క్రితం వాచ్‌మెన్‌గా చేరారు. మంగళవారం రాత్రి కృపానిధి షోరూం బయట కాపలాగా కూర్చున్నారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇద్దరు కిరాతకులు ఎర్రటి స్కూటీపై ఇన్నర్ రింగ్‌రోడ్డు వైపు నుంచి వచ్చి షోరూంకు కొంచెం అవతలగా బండిని నిలిపారు. ఓ దుండగుడు బండి వద్ద నిలబడి ఉండగా మరొకడు తనతో పాటు తెచ్చుకున్న ఇనుపరాడ్డును వెనకపెట్టుకుని చిన్నగా షోరూం బయట కాపలాగా కూర్చున్న కృపానిధి వద్దకు చేరుకున్నాడు. అప్పటికే కృపానిధి వద్ద పడుకున్న కుక్క దొంగను చూసి అరవడంతో అప్రమత్తమయ్యేలోపు నిందితుడు రాడ్డుతో తలపై దాడి చేశాడు. విచక్షణారహితంగా తలపై మోదాడు. దీంతో కుర్చీలో కూర్చున్న వ్యక్తి అలానే మృత్యు ఒడికి చేరాడు. వెంటనే నిందితుడు షోరూం తలుపులు పగలగొట్టి క్యాష్ కౌంటర్‌లో నగదు, ఒక హెల్మెట్‌ను తీసుకుని మళ్లీ ద్విచక్ర వాహనంపై నగరంలోకి పరారయ్యారు. తెల్లవారుజామున రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రయాణికులు గమనించి విషయాన్ని



కన్నీరుమున్నీరవుతున్న కృపానిధి కుటుంబ సభ్యులు

- మిగతా 8లో..



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఐజీ త్రివిక్రమ్‌వర్మ, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

ఇద్దరూ పట్టివేత

నగరంపాలెం(గుంటూరు): గుంటూరు నగరంలో సంచలనం రేకెత్తించిన ఇద్దరు వాచ్‌మెన్ల హత్య కేసుల్లో ఇద్దరు మైనర్లను గుంటూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఇద్దరిలో ఒకరు పాత నేరస్తుడు. వారి నుంచి ఒక గడ్డ పలుగు, హెల్మెట్, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని స్పందన హాల్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసుల వివరాలను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ వెల్లడించారు. మంగళవారం రాత్రి అరండల్‌పేటలో ఓ దుకాణ షట్టర్లు పగులగొట్టారని డయల్ 100కు ఫోన్ చేసి చెప్పారన్నారు. దీంతో అరండల్‌పేట పోలీస్ స్టేషన్ రక్షక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నట్లు తెలిపారు. చోరీకి యత్నించిన వారి వెంటపడగా, రెప్పపాటులో తప్పించుకున్నారు. బుధవారం తెల్లవారుజాము సమయంలో నల్లపాడు పోలీస్‌స్టేషన్, అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు వాచ్‌మెన్లు హత్యకు గురయ్యారు. ఈ క్రమంలో ఒక ముఠాగా ఏర్పడి హత్యలు చేసి ఉంటారని దర్యాప్తు వేగవంతం చేశారు. దీంతో సీసీటీవీ ఫుటేజీ, వేలిముద్రలు, సెల్‌ఫోన్‌ల ఆధారంగా విచారించారు. తూర్పు, దక్షిణ, పశ్చిమ సబ్ డివిజన్లలోని ఎనిమిది పోలీస్ బృందాలతో పాటు సీసీఎస్, ఐటీ కోర్ బృందాలు కూడా రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయన్నారు. పట్టాభిపురం పీఎస్ పరిధిలో గతంలో జరిగిన దొంగతనాల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేసినట్లు తెలిపారు. దీంతో గుంటూరు నగరంలోని కొబాల్డుపేటకు చెందిన ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకుని విచారించారు. వీరిద్దరూ కలిసికట్టుగా ఈ ఘాతుకాలకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. ఏ-1గా ఉన్న వ్యక్తిపై ఐదు కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. చిల్లర దుకాణాలు, బడ్డీ దుకాణాలు, మెడికల్ షాప్‌ల తాళాలు పగులకొట్టి నేరాలకు పాల్పడేవాడు. గతంలో అరెస్ట్ చేయగా, ఇటీవల బయటకు వచ్చి ఈ ఘోరాలకు పాల్పడ్డాడని చెప్పారు. 12 గంటల వ్యవధిలో హత్య కేసులను ఛేదించామన్నారు.

న్యూస్‌రీల్

తొలి రోజు జిల్లాలో 75 శాతం పింఛన్ల పంపిణీ



నరసరావుపేట రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుకను నెల మొదటి రోజే జిల్లాలో 75.38 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తెల్లవారుజామునే ఇళ్ల వద్దకు వెళ్లి వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. జిల్లాలో మొత్తం 2,70,234 మందికి రూ.74,95,78,000ను రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ కానుకగా విడుదల చేసింది. ఇందులో బుధవారం 2,03,702 మందికి రూ.56,49,55500 లను అందించారు. సూర్యోదయానికి ముందే వలంటీర్లు తలుపుతట్టి పెన్షన్‌ను అందించడంతో లబ్ధిదారుల్లో సంతోషాలు తొణికిసలాడాయి.

9 నుంచి ఎఫ్‌ఏ-4 పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 9వ తేదీ నుంచి ఫార్మేటివ్ అసెస్మెంట్-4 (ఎఫ్‌ఏ-4) పరీక్షలను జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు ఈ నెల 9, 10, 11వ తేదీల్లో ప్రతి రోజు రెండు విడతల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. 6, 7, 8, 9వ తరగతులకు ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు వివిధ సబ్జెక్టుల వారీగా 9 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ పరీక్షలను జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు.

3న నర్సుల సంఘ సమావేశం

గుంటూరు మెడికల్: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం జనరల్ బాడీ సమావేశం శుక్రవారం గుంటూరు జీజీహెచ్ శుశ్రుత హాలులో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా సెక్రటరీ వెలంపల్లి పద్మజ తెలిపారు. జిల్లా సంఘానికి ఎన్నికల నిర్వహణ, సభ్యత్వ నమోదు, ఇతర అంశాలపై చర్చించేందుకు మధ్యాహ్నం 12.30 గంటలకు సభ్యులంతా హాజరు కావాలన్నారు.

ఇష్టం పెంచుకొని చదవాలి



అచ్చంపేట: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులంతా ప్రణాళిక తయారు చేసుకుని, సబ్జెక్టుపై మక్కువ పెంచుకుని చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యపడతాయని ఏపీ డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డి.దేవానందరెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ప్రశాంతతతో చదవిన విషయాలను మననం చేసుకుంటూ మనస్సు కేంద్రీకృతం చేయాలని చెప్పారు. నిద్రమానేసి చదవడం వల్ల వచ్చిన విషయాలను మర్చిపోతారే తప్ప కొత్తగా వచ్చేదేమి ఉండదన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి వి.రాజశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

యార్డులో 1,15,052 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,10,959 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,15,052 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర దక్కింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 86,584 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

డబుల్ లైన్‌కు గ్రీన్‌సిగ్నల్

- గుంటూరు-బీబీనగర్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు కేంద్రం ఓకే
- పీఎం గతిశక్తి పథకం ద్వారా 248 కి.మీ. లైన్ నిర్మాణానికి రూ.2,853 కోట్లు అంచనా
- త్వరలో పనులు ప్రారంభం
- డబుల్ లైన్‌తో తగ్గనున్న ప్రయాణ సమయం, పెరగనున్న గూడ్స్ రైళ్లు
- పల్నాడులోని సున్నపురాయి, సిమెంట్ ఎగుమతులకు మరింత వెసులుబాటు
- పారిశ్రామిక అభివృద్ధికి దోహదం చేస్తుందంటున్న గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణ



గుంటూరు-బీబీనగర్ రైల్వే లైన్‌లో సత్తెనపల్లి సమీపంలో ప్రస్తుతం ఉన్న సింగిల్ లైన్

సాక్షి, నరసరావుపేట: గుంటూరు రైల్వే డివిజన్‌లో నడికుడి మార్గం ఎంతో కీలకమైనది. తెలంగాణలోని సికింద్రాబాద్ జంక్షన్‌ను అనుసంధానం చేసే మార్గమిది. ఇప్పటికే విద్యుద్దీకరణతో సింగిల్ లైన్ అందుబాటులో ఉన్నా లైన్ కెపాసిటీ 100 శాతం దాటింది. దీంతో కొత్త రైళ్లు రాకపోగా, ప్రస్తుత రైళ్ల ప్రయాణ సమయం అధికంగా ఉంటోంది. దీంతో గత కొన్ని దశాబ్దాలుగా గుంటూరు-బీబీనగర్ రైల్వే లైన్‌ను డబ్లింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం 2019-20 రైల్వే బడ్జెట్‌లో ఈ లైన్ డబ్లింగ్ చేసే ప్రతిపాదనలకు రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూడేళ్లలో కేవలం డీపీఆర్ మాత్రమే సిద్ధమైంది. అయితే తాజాగా ఈ పనులను పీఎం గతిశక్తి పథకం ద్వారా చేపట్టడానికి కేంద్ర రైల్వే శాఖ సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం నిర్మాణానికి సమగ్ర ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. వీలైనంత త్వరగా పనులు పట్టాలెక్కించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

248 కి.మీ. రూ.2,853 కోట్లు

ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి బీబీనగర్ వరకు డబుల్‌లైన్ అందుబాటులో ఉంది. మిగిలిన బీబీనగర్ సమీపంలోని పగిడిపల్లి నుంచి నల్లపాడు మధ్య 248 కిలోమీటర్ల పొడవునా రెండో రైలు మార్గం నిర్మించాలి. దీనికి సుమారు రూ.2,853 కోట్ల నిధులు అవసరం కాగా ప్రభుత్వం తొలి విడతగా రూ.600 కోట్లు మంజూరు చేసింది. డబ్లింగ్ పూర్తయితే క్రాసింగ్ సమస్య దాదాపుగా పరిష్కారం అవ్వడం వల్ల ప్రయాణికులకు 15 నిమిషాలకు పైగా సమయం ఆదా కానుంది. తెనాలి - విజయవాడ - కాజీపేట మీదగా సికింద్రాబాద్ వెళ్లే పలు రైళ్లను గుంటూరు మీదగా మళ్లించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అంతేకాకుండా గరిష్ట వేగం కూడా 110 కిలోమీటర్ల నుంచి 130 కిలోమీటర్లకు పెరుగుతుంది. దీంతో వందే భారత్ వంటి ప్రీమియం రైళ్లను కూడా నడిపేందుకు ఆస్కారం ఉంటుంది.

కొత్త రైళ్లు.. ఎగుమతులకు ఊతం

గుంటూరు నుంచి బీబీనగర్ మీదుగా సికింద్రాబాద్ రైల్వే లైన్ డబ్లింగ్ పూర్తయితే, తెలుగు రాష్ట్రాల మధ్య రైలు ప్రయాణం వేగం పెరగడంతో పాటుగా రైళ్ల సంఖ్య పెరగనుంది. ఇప్పుడు ఉన్న ప్యాసింజర్ రైళ్లతో పాటు కొత్త రైళ్లు వచ్చి ప్రయాణికులకు సేవలందిస్తాయి. దీంతో పాటు ఈ లైన్లో సరుకు రవాణా ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఉన్న సున్నపురాయి, సిమెంట్, వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులు ఎగుమతికి ఊతం లభించనుంది. రైతులు తమ పంటలను ఇతర రాష్ట్రాలకు సులభంగా ఎగుమతి చేసుకోవడానికి వీలుకలుగనుంది.


వీలైనంత త్వరగా పనులు ప్రారంభం



గుంటూరు-బీబీనగర్ మధ్య 248 కిలోమీటర్ల రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు రైల్వేశాఖ రూ.600 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇప్పటికే డీపీఆర్‌లు సిద్ధమయ్యాయి. టెండర్ల ప్రక్రియకు అవసరమైన సమగ్ర నివేదికలు సిద్ధమవుతున్నాయి. అవి పూర్తికాగానే పనులు పట్టాలెక్కనున్నాయి. మరో మూడు నాలుగేళ్లలో డబ్లింగ్ పనులు పూర్తయ్యే అవకాశముంది. డబ్లింగ్ పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడంతో పాటు, కొత్త ప్యాసింజర్, గూడ్స్ రైళ్లు పెరగనున్నాయి. దీంతో ప్రయాణికులు, సరుకు రవాణాదారులకు మేలు జరగనుంది.

– ఎం.రామకృష్ణ, డీఆర్‌ఎం, గుంటూరు డివిజన్

సరుకు రవాణాకు మేలు కలగనుంది



గుంటూరు-బీబీనగర్ మధ్య ప్రస్తుతం సింగల్ రైల్వే లైన్ ఉండటంతో గుడ్స్ రైళ్లు తక్కువగా నడుస్తున్నాయి. పిడుగురాళ్ల ప్రాంతంలో లభించే సున్నపురాయి ముడిసరుకు, ఉత్పత్తులను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసుకోవడానికి సరైన గూడ్స్ రైళ్లు లేవు. ఈ మార్గం డబ్లింగ్ అయితే సరుకు రవాణాకు మేలు జరగనుంది. మా ప్రాంతంలో పండే మిర్చి, పత్తి వంటి పంటలను సైతం సులభంగా ఎగుమతి చేయవచ్చు.

– వి.రామిరెడ్డి, సున్నం వ్యాపారి, పిడుగురాళ్ల

తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

- పల్నాడు ప్రజలకు శుద్ధి జలం అందజేస్తామన్న ఎంపీ లావు
- మొత్తం రూ.3.32 కోట్లతో మాచర్ల, గురజాలలో 37 వాటర్ ప్లాంట్ల నిర్మాణం
- రూ.2.49 కోట్లు అందించిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్
- ప్రాజెక్టు నిర్మాణంలో 25 శాతమైన రూ.83 లక్షలను ఎంపీ నిధుల నుంచి కేటాయింపు



నరసరావుపేట: పల్నాడులో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. గడిచిన కాలంలో పల్నాడులో చాలా గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఎంపీ నిధులను వినియోగించి వాటర్ ప్లాంట్ల నిర్మాణం చేశామని, నూతనంగా 37 ప్లాంట్ల నిర్మాణానికి నిధులు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు బుధవారం జిల్లా పరిపాలన విభాగం నుంచి విడుదలయ్యాయన్నారు. జిల్లాలోని మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో రూ.3.32 కోట్లతో 37 ఆర్‌ఓఆర్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటవుతున్నాయన్నారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) లిమిటెడ్ సీఎస్‌ఆర్ చొరవతో రూ.2.49 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ప్రాజెక్టు వ్యయంలో మరో 25 శాతం నిధులు అంటే రూ.83 లక్షలను తన ఎంపీ నిధుల నుంచి అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

వాటర్ ప్లాంట్లు ఏర్పాటవుతున్న గ్రామాలు..

గురజాల నియోజకవర్గం దాచేపల్లి మండలంలోని పెదగార్లపాడు, ముత్యాలంపాడు, శంకరపురం, సారంగపల్లి, మాచవరం మండలంలోని గంగిరెడ్డిపాలెం, పిల్లుట్ల, పిడుగురాళ్ల మండలంలోని చినఅగ్రహారం, తుమ్మల చెరువు, వీరాపురం, మంగాపురం, పండిటవారిపాలెం, కొత్త వెల్లంపల్లి, జానపాడు, కరాలపాడు, గుత్తికొండ, కోనంకి, గురజాల మండలంలోని చర్లగుడిపాడు, పులిపాడు, జనార్ధనపురం, అంజనపురం, దైద, మాచర్ల మండలంలోని బ్రహ్మానందపురం, కొత్తూరు, తాళ్లపల్లి, హసనాబాద్ తండా, వీపీ సౌత్, కారంపూడి మండలంలోని కారంపూడి తండా, రామపురం తండా, దుర్గి మండలంలోని నెహ్రూనగర్ తండా, తెరాల, వెల్దుర్తి మండలంలోని దావుపల్లి, పిచ్చిబాయతండా, మూస పెంటతండా, రామచంద్రపురం తండా, రెంటచింతల మండలంలోని రెంటచింతల, జెట్టివారిపాలెం గ్రామాలు ఉన్నాయన్నారు.

క్రీస్తు ఏసు ప్రజా రక్షకుడు

- 46వ గుడారాల పండుగకు ముందస్తు ప్రార్థనలు
- ప్రారంభించిన హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ



ముందస్తు ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు అబ్రహాం, జాన్‌వెస్లీ, రాజు, ఫ్రైడిపాల్, రమేష్ తదితరులు

గుంటూరు రూరల్: క్రీస్తు ఏసు ప్రజా రక్షకుడని హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్ వెస్లీ పేర్కొన్నారు. హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 46వ గుడారాల పండుగ ముందస్తు ప్రార్థనలు బుధవారం ప్రారంభించారు. సౌత్ ఆఫ్రికాకు చెందిన పాస్టర్ జాషువా మోజెస్ స్టేజ్ డెడికేషన్ ప్రార్థన చేసి, వేదికను ప్రారంభించారు. ప్రత్యేక ప్రార్థనలకు వచ్చే విశ్వాసుల కోసం ప్రత్యేక వసతి, భోజన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనే విశ్వాసులకు పోలీసులు తగిన బందోబస్తును కల్పించారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రైల్వే, ఆర్టీసీలు రవాణా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక ప్రార్థనల్లో రెండు తెలుగు రాష్ట్రాలు, భారతదేశం, ప్రపంచం ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని ప్రార్థనలు చేశారు. హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్స్ రాజు, ఫ్రైడిపాల్, రమేష్, నతానియేలు, మినిస్ట్రీస్‌కు చెందిన సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం 5 గంటలనుంచి 5వ తేదీ మధ్యాహ్నం వరకూ ఈ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

గుడారాల పండుగ ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ..

గుంటూరు రూరల్: ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగే 46వ గుడారాల పండుగ మహాసభల ప్రాంగణాన్ని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా సభలకు వచ్చే భక్తుల కోసం తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అందుకు తగిన సదుపాయాలు, భద్రత ఏర్పాట్లు చేశామని తెలిపారు. హోసన్నా మందిరానికి చెందిన కమిటీ సభ్యులను కలిసి అధికారులకు సహకరించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా వసతులు, ఏర్పాట్లు, ట్రాఫిక్, ఇతర సౌకర్యాలు పరిశీలించారు. ఎస్పీతోపాటు క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ అదనపు ఎస్పీ కోటేశ్వరరావు, సీసీఎస్ డీఎస్పీ మోజెస్‌పాల్, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాలు అదరహో



గుణదల(విజయవాడ తూర్పు): వేగా జ్యూయలర్స్ సంస్థ నోవాటెల్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన బంగారు ఆభరణాల ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. పలు రకాల డిజైన్‌లను ధరించిన మోడల్స్ ర్యాంప్ వాక్ చేసి అలరించారు. నగరంలో వేగా జ్యూయలర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈ ఫ్యాషన్ షోను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వనమానవీస్‌కుమార్, సుధాకర్ తెలిపారు. తెలుగు జాతి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేలా తాము ఆభరణాలు తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆభరణాల, నాణ్యతలో, తయారీలో రాజీ పడబోమని స్పష్టంచేశారు.

భరోసాకు చిరునామా జగనన్న పాలన

రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన ఆత్మీయతకు, జీవన భరోసాకు చిరునామా అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని అనుపాలెంలో వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు బుధవారం పింఛన్ పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారుల యోగక్షేమాలు తెలుసుకుంటూ 644 మంది పింఛన్ దారులకు పింఛన్ అందజేశారు. గ్రామస్తులు అడిగిన చిన్నచిన్న సమస్యలను అక్కడికక్కడే అధికారులను పిలిచి పరిష్కరించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వలంటీర్ల సహాయంతో ఉదయాన్నే ప్రతి నెల 1వ తేదీన పింఛన్‌లను నేరుగా లబ్ధిదారులకు అందజేయడం ఇంతవరకు ఏ ప్రభుత్వం చేయలేదని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచి సానికొమ్ము వెంకటసుబ్బమ్మశ్రీనివాసరెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పులిబండ్ల అశోక్, వైఎస్సార్ సీపీ నాయకులు అన్నపురెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



అనుపాలెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు

సమస్యల పరిష్కార వేదికగా జీ- 20 సదస్సు

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- ఎన్ఈసీలో మాక్ పార్లమెంట్

నరసరావుపేట రూరల్: ప్రపంచం ఎదుట ఉన్న సమస్యలకు ప్రణాళికబద్ధమైన పరిష్కారాలు కనుగునేందుకు జీ–20 సదస్సు దోహదపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నెహ్రూ యువకేంద్ర, ఎడ్యుకేట్ ది సొసైటీ సహకారంతో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా స్థాయి నైబర్ హుడ్ మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.
కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది జీ–20 సదస్సుకు మన దేశం ఆతిథ్యం ఇస్తుందని తెలిపారు. సెప్టెంబర్ 9,10 తేదీలలో ఢిల్లీలోని ప్రగతి మైదానంలో నిర్వహించే సదస్సు థీమ్ వన్ ఎర్త్– వన్ ఫ్యామిలీ– వన్ ఫ్యూచర్ అని వివరించారు. ప్రపంచ ఆర్థిక స్థిరత్వం, వాతావరణంలో మార్పుల్లో అసమతుల్యం, సంతులిత వృద్ధి మొదలైన సమస్యలకు సదస్సులో పరిష్కారాలను సూచిస్తారని తెలిపారు. ఎన్ఈసీ కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఇతర నైపుణ్యాలు వెలుగులోకి వచ్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యూత్ ఆఫీసర్ డి.కిరణ్మయి, స్టెప్ సీఈఓ ఎస్.పల్లవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసకుమార్, కళాశాల కార్యదర్శి, పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, వైస్‌చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నేడు వైద్యులు, సిబ్బంది ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమం ద్వారా వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ చేసేందుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. మెడికల్ ఆఫీసర్ పోస్టులు 30, స్టాఫ్‌నర్సు పోస్టులు 40, పిల్లల వైద్య నిపుణుల పోస్టులు 3, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు 5, కార్డియాలజిస్టు పోస్టు 1, ఫిజియోథెరపిస్టు పోస్టు 1, ఇతర కేటగిరిలకు చెందిన పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారాలు, విద్యార్హతలు, ఇతర వివరాల కోసం గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాటు జిరాక్స్ కాపీలు వెంట తీసుకు రావాలన్నారు.

క్లుప్తంగా

డయాలసిస్ రోగికి పెన్షన్ పంపిణీ



అచ్చంపేట: మాదిపాడు గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వరరావు గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూడయాలసిస్ చేయించుకుంటున్నాడు. వలంటీరు బలరాం గుప్తా గమనించి, గ్రామ సచివాలయం ద్వారా జగనన్న పెన్షన్ కానుక కింద రూ.10,000 మంజూరు చేయించాడు. మంగళగిరి ఎన్ఆర్ఐ వైద్యశాలలో రోగి వెంకటేశ్వరరావు చికిత్స పొందుతుండగా బుధవారం మంజూరైన తొలి పెన్షన్‌ను అందజేశాడు. తనను గుర్తించడమే కాకుండా ఫస్ట్ తారీఖు తనను వెతుక్కుంటూ వచ్చి రూ.10వేలు పెన్షన్ అందచేసిన సచివాలయ సిబ్బందికి, వలంటీరుకు, సీఎం జగన్‌మోహన్ రెడ్డికి బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

వ్యాపారి నుంచి నగదు బ్యాగు లాక్కునే యత్నం

గుంటూరు ఈస్ట్: బ్యాంకులో డబ్బులు డ్రా చేసి బయటకు వచ్చిన వ్యక్తి చేతిలోని డబ్బు సంచిని ఇద్దరు దుండగులు లాక్కొని వెళ్లేందుకు విఫలయత్నంచేశారు. సేకరించిన సమాచారం మేరకు లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులోకి మిర్చి వ్యాపారి కాసు బ్రహ్మానందరెడ్డి బుధవారం వెళ్లాడు. రూ. 14లక్షలు డ్రా చేసి డబ్బులు బ్యాగులో పెట్టుకుని బ్యాంకు బయటకు వచ్చాడు. ముందుగానే పథకం ప్రకారం ఓ ద్విచక్రవాహనంపై వేచి ఉన్న ఇరువురు బ్రహ్మానందరెడ్డి వద్దకు వచ్చిడబ్బు సంచి లాక్కొన్నారు. అయితే బ్రహ్మానందరెడ్డి తీవ్రంగా ప్రతిఘటించి బ్యాగు తిరిగి లాక్కొని పక్కకు పరుగెత్తడంతో నిందితులు చేసేది లేక ద్విచక్రవాహనంపై పరారయ్యారు. బ్రహ్మానందరెడ్డి జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే బ్యాంకు బయట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు లోపల ప్రవేశ ద్వారం వరకు మాత్రమే రికార్డు అయి ఉన్నాయి. మెయిన్ రోడ్డు మీదకు కెమెరాలు పెట్టలేదు. పక్కనే ఉన్న మరో సంస్థ సీసీ కెమెరాలు ఇదేవిధంగా ఉన్న కారణంగా నిందితులు సీసీ కెమెరాలో రికార్డు కాలేదని తెలుస్తోంది.

లారీ ఢీకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడు దుర్మరణం

తాడికొండ: ద్విచక్ర వాహనాన్ని ఇసుక లారీ ఢీకొట్టడంతో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన తాడికొండ అడ్డరోడ్డులో జరిగింది. వివరాల ప్రకారం తెనాలి మండలం అంగలకుదురు గ్రామానికి చెందిన కసుకుర్తి విజయరాజు వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ప్రస్తుతం రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో పనిచేస్తున్నారు. ఇతని భార్య విజయ శాంతి తుళ్ళూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో ప్రభుత్వ టీచరుగా పనిచేస్తుంది. తుళ్లూరులో అద్దెకు ఉంటూ ప్రతి రోజు ద్విచక్ర వాహనంపై విధులకు హాజరవుతున్న విజయరాజు ఎప్పటిలానే బుధవారం ఉదయం ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ వాహనంపై విధులకు వెళుతుండగా తాడికొండ అడ్డరోడ్డు వద్ద అమరావతి నుంచి వస్తున్న ఇసుక లారీ బలంగా ఢీకొట్టింది. ఘటనలో విజయరాజుకు తలకు బలమైన గాయం కావడంతో పాటు తొడ భాగంలో మీదకు ఎక్కడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న తాడికొండ ఏఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి, మృతుడి వివరాలు సేకరించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. మృతుడికి 12 సంవత్సరాల కుమార్తె, 10 సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. మృతుడి సోదరుడు కసుకుర్తి బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తుల దాడులు

పట్నంబజారు(గుంటూరు): గుర్తుతెలియని ఆగంతకులు ఇనుప రాడ్లతో దాడులకు పాల్పడిన సంఘటన తీవ్ర కలకలం రేపింది. తెల్లవారుజాము సమయంలో దాడులకు తెగబడి సెల్‌ఫోన్, నగదు దోచుకెళ్లడంతో బాధితులు బెంబేలెత్తిపోయారు. పాతగుంటూరు పోలీసులు, బాధితుల కథనం మేరకు.. పాతగుంటూరు ఆంధ్రాబ్యాంకు రోడ్డులో నివాసం ఉండే నేరెళ్ల ఫణీంద్ర పలు దినపత్రికలకు సంబంధించి డిస్ట్రిబ్యూటర్‌గా వ్యవహరిస్తున్నారు. బుధవారం తెల్లవారుజాము 4:30 గంటల సమయంలో ఆంధ్రాబ్యాంకు వద్ద పేపరు కట్టలు కడుతున్న సమయంలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై అక్కడకు వచ్చారు. కొద్ది దూరంలో బైక్ ఆపగా, ఒక యువకుడు నడుచుకుంటూ వచ్చి పేపర్ ధర ఎంత అని అడుగుతూ, తన వెంట తెచ్చుకున్న రాడ్డుతో ఫణీంద్రపై దాడికి పాల్పడ్డాడు. అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని అక్కడ నుంచి ఆ యువకులు పరారయ్యారు. ఈ క్రమంలో సుద్దపల్లిడొంక సమీపంలో పాలబూత్ నిర్వహించే ఎండ్లూరి రవికుమార్ అలియాస్ ఏసుబాబుపై దాడి చేయడంతో నడుముకు తీవ్రగాయమైంది. రవికుమార్ ప్రతిఘటించటంతో అక్కడ నుంచి పరారయ్యారు. గాయాలపాలైన రవికుమార్ జీజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందారు. యాదవ హైస్కూల్ వద్ద మరో వ్యక్తిపై దాడి చేసి పరారీ అయినట్లు స్థానికులు చెబుతున్నారు. బాధితుడి వివరాలు తెలియాల్సిఉంది.

ఐదు షాపుల్లో చోరీలు..

ఇద్దరు వ్యక్తులపై దాడులు చేసిన ఆ ఇద్దరు యువకులు నందివెలుగు రోడ్డులోని శ్మశానాలరోడ్డులో రెండు ఆటో ఫైనాన్స్, రెండు స్టిక్కరింగ్, ఒక కూల్‌డ్రింక్ షాపుల్లో చోరీలకు పాల్పడ్డారు.

మైనర్ల పైశాచికం

▶ఏడవపేజీ తరువాయి

నల్లపాడు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాసరావు సంఘటన స్థలికి చేరుకున్నారు. విషయం తెలిసిన రేంజ్ ఐజీ త్రివిక్రమవర్మ, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, సీసీఎస్ డీఎస్పీ మోజెస్‌పాల్ వచ్చి సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం ఆధారాలు సేకరించాయి. సీసీ ఫుటేజీలో దొరికిన ఆధారాలను బట్టి పాత నేరస్తులే ఈ ఘటనకు పాల్పడినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నల్లపాడు పోలీసులు నిందితులను గంటల వ్యవధిలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో చోట వాచ్‌మెన్ హత్య

గుంటూరు ఈస్ట్: అరండల్‌పేటలో దొంగలు బీభత్సం సృష్టించారు. ప్రభుత్వ వైన్‌మార్ట్ వాచ్‌మెన్‌ను హత్య చేశారు. మరో వాచ్‌మెన్‌పై హత్యా యత్నం చేశారు. నాలుగు షాపుల్లో చోరీకి యత్నించారు. ఒక సెల్‌షాపులో చోరీకి తెగబడ్డారు. చివరకు పోలీసు జీపుపై కూడా దాడి చేశారు. అరండల్‌పేట ఎస్‌హెచ్‌ఓ రామానాయక్ తెలిపిన వివరాల ప్రకారం .. మంగళవారం అర్ధరాత్రి 2.45 గంటల సమయంలో ఇద్దరు దుండగులు తొలుత అరండల్‌పేట 11/2లోని మీసేవా షట్టర్ తాళాలు పగులగొట్టి చోరీకి విఫలయత్నం చేశారు. పదో లైను స్వగృహ స్వీట్ షాపు పక్కన ఉన్న షాపుల్లో చోరీకి యత్నించారు. వరుసగా నాలుగు షట్టర్లు తెరిచేందుకు ప్రయత్నించి మూడు చోట్ల విఫలమయ్యారు. హైనెస్ సెల్ షాపు షట్టర్ తెరిచి లోపలకు వెళ్లి రెండు ట్యాబ్‌లు, ఆరు స్మార్ట్ వాచ్‌లు, ఇతర సామగ్రి మొత్తం రూ.45 వేల విలువగల సొత్తు దోచుకున్నారు. గమనించిన స్వగృహ స్వీట్ షాపు వాచ్‌మెన్ వారిని నిలువరించేందుకు వచ్చాడు. దుండగులు వాచ్‌మెన్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వాచ్‌మెన్ అక్కడి నుంచి పరుగెత్తి అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి విధుల్లో ఉన్న ఉదయ్ అనే కానిస్టేబుల్ వెంటనే జీపులో ఘటనా స్థలానికి చేరుకున్నాడు. ఇద్దరు దుండగులను పట్టుకునే ప్రయత్నంలో కేకలు వేశాడు. అయితే దుండగుల్లో ఒకడు తన చేతిలోని రాడ్డుతో కానిస్టేబుల్‌పై దాడికి యత్నించాడు. జీపుపై మోదాడు. కానిస్టేబుల్ ఉదయ్ చాకచక్యంగా తప్పించుకున్నాడు. దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్‌హెచ్‌ఓ రామానాయక్ ఘటనా స్థలానికి వచ్చి నిందితులను పట్టుకునేందుకు పలు వీధుల్లో తిరిగారు. దుండగులు అరండల్‌పేట 2వ లైనులో ఒక చోట కూర్చొని మద్యం సేవించారు. దుండగుల్లో ఒకడు మాస్క్ వేసుకుని హెల్మెట్ ధరించాడు. ఒక చోట ఇద్దరు అనుమానితులు కనిపించడంతో ఎస్‌హెచ్‌ఓ రామానాయక్ పట్టుకునేందుకు ప్రయత్నించగా పరారయ్యారు. అయితే కొంతసేపటికి సత్యనారాయణ అనే వ్యక్తి వచ్చి ఎస్‌హెచ్‌ఓకు తన తండ్రిని ఎవరో హత్య చేశారంటూ ఫిర్యాదు చేశాడు.

రక్తపు మడుగులో..

అరండల్‌పేట 10/2లోని ప్రభుత్వ వాక్ ఇన్ లిక్కర్ స్టోర్ వద్దకు ఎస్‌హెచ్‌ఓ వెళ్లి చూడగా సత్యనారాయణ తండ్రి బత్తుల సాంబశివరావు (63) అలియాస్ శివయ్య రక్తపు మడుగులో పడి ఉన్నాడు. పరిశీలించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే తొలుత దుండగులు సాంబశివరావును రాడ్డుతో కొట్టి హత్య చేసి లిక్కర్ స్టోర్ షట్టర్ తీయడానికి ప్రయత్నించి విఫమై అనంతరం సెల్‌షాపు వద్దకు వచ్చి చోరీ చేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలాలను పరిశీలించి ఆనవాళ్లు సేకరించాయి. ఐజీ త్రివిక్రమవర్మ, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, ఇతర అధికారులు ఘటనా స్థలం వద్దకు చేరుకుని పరిశీలించారు.



రోదిస్తున్న వాచ్‌మెన్ సాంబశివరావు కుటుంబ సభ్యులు

వైభవం.. నృసింహస్వామి బ్రహ్మోత్సవం

రాజాధిరాజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన దేవదేవుడు

మంగళగిరి: పట్టణంలో వేంచేసివున్న లక్ష్మీనృసింహ స్వామివారు మంగళాద్రి తిరునాళ్ల(బ్రహ్మోత్సవాలు)లలో భాగంగా బుధవారం రాత్రి రాజాధిరాజ వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. దీనజన బంధువు భక్తజన సంరక్షణ కంకణబద్ధుడైన నృసింహస్వామి రాజాధిరాజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద వున్న రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు కళావేదికలో ఏర్పాటు చేసిన భగవద్గీత ప్రవచనం, భక్తిగీతాలు, భరతముని కూచిపూడి నృత్యం, హరికథ, లక్ష్మీనృసింహ వైభవంపై ప్రవచనం, సద్గురు నారాయణ తీర్థుల తరంగాలు, మోహిని భస్మాసుర నృత్యప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన కోలాటం, విచిత్ర వేషధారణలు డప్పులు కనకతప్పెట్లతో ఉత్సాహంగా కొనసాగింది. ఆలయం వద్ద నుంచి బయల్దేరిన గ్రామోత్సవం మెయిన్‌బజార్ మీదుగా మిద్దె సెంటర్‌కు చేరుకోగా భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. భక్తులందరూ స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు పొందారు. ఉత్సవాలను ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించగా కైంకర్యపరులుగా దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామానికి చెందిన పెమ్మసాని శైలేంద్రలు వ్యవహరించారు.



రాజాధి రాజ వాహనంపై గ్రామోత్సవం

నేడు యాలి వాహనంపై..

బ్రహ్మోత్సవాలలో భాగంగా నృసింహస్వామి వారు గురు వారం రాత్రి యాలి వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి తెలిపారు. ఉత్సవాలను భక్తులు తిలకించి స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఈఓ కోరారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాకు ద్వితీయ స్థానం

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో పల్నాడు జిల్లాకు సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్ విభాగంలో ద్వితీయ స్థానం లభించింది. విజయవాడలోని లయోల కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో రెంటచింతల మండలం జెట్టిపాలెం ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థి మహేష్ కుమార్ రూపొందించిన పీ–యాప్ నమూనా ప్రదర్శనకు ఉత్తమ ద్వితీయ స్థానం లభించినట్లు జిల్లా సైన్స్ అధికారి ఏఏ మధుకుమార్ బుధవారం తెలిపారు. ఈయాప్ ద్వారా 12 రకాల సేవలను పొందవచ్చని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 260 మంది విద్యార్థులు తమ నమూనాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. ద్వితీయ స్థానం సాధించిన మహేష్‌కుమార్‌కు ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్‌కుమార్, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందించారు. విద్యార్థి మహేష్‌కుమార్, గైడ్ టీచర్ జి.నాగజ్యోతిని ఆర్‌జేడీ వి.ఎస్. సుబ్బారావు, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటప్పయ్య అభినందించారు.



విద్యార్థి మహేష్‌కుమార్‌కు బహుమతులు అందిస్తున్న ఎన్టీఆర్ జిల్లా జేసీ, మేయర్ తదితరులు

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

వేటపాలెం: బాపట్ల జిల్లా వేటపాలెం రైల్వే స్టేషన్ వద్ద గూడ్స్ రైలు బుధవారం పట్టాలు తప్పింది. రైల్వే స్టేషన్ ముందు తూర్పు వైపు లూప్ లైన్‌లో సిమెంట్ స్లీపర్స్ లోడుతో వస్తున్న గూడ్స్ రైలు జక్షన్ వద్ద రెండు బోగీలు పట్టాలు తప్పాయి. విషయం గమనించిన డ్రైవర్ వెంటనే రైలును నిలిపి వేశాడు. వేటపాలెం రైల్వే స్టేషన్‌కి తూర్పు వైపున రైల్వేకి సంబంధించిన పట్టాలు, స్లీపర్లు.. పాతవి కొత్తవి గూడ్స్ రైలు ద్వారా తీసుకొచ్చి నిల్వ ఉంచుతుంటారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారు ఘటనా స్థలానికి చేరుకొని మరమ్మతులు నిర్వహిస్తున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

వినుకొండ(నూజెండ్ల): ఆర్టీసీ కార్గో పార్శిల్ సర్వీస్‌లో మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ నుంచి తెల్లవారుజామున కార్గోలో వినుకొండకు చేరుకున్న రెండు బ్యాగ్‌లు, ఒక పెద్ద సూట్‌కేసులో 24 మద్యం సీసాలు ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.9148 టీఎంసీలు ఉంది. ప్రాజెక్టు ఎగువ నుంచి 4200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4000 క్యూసెక్కులు వదులుతున్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 2212 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 116 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 237 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 270 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 30 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 160 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1179 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాల్సిందే

అధికారులకు గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఆదేశం

తాడేపల్లి రూరల్: ఉగాది నాటికి జిల్లాలోని అర్హులైన పేదలందరికీ ఇళ్ల పథకం లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి హౌసింగ్ ఎంపీడీఓ, తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల పథకంలో ఉగాది నాటికి కచ్చితంగా పూర్తి చేసేలా ప్రణాళికలు తీసుకోవాలని అన్నారు. సచివాలయ ఉద్యోగులను ఇళ్ల నిర్మాణాల్లో భాగస్వామ్యం చేసి నిర్మాణ పనులు వేగవంతం చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. లే అవుట్‌లో మంజూరు చేసిన అభివృద్ధి పనులు మార్చి 10వ తేదీ నాటికి కచ్చితంగా పూర్తయ్యేలా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గడప గడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేసిన పనులు నూరుశాతం వచ్చే శనివారం నాటికి గ్రౌండింగ్ చేయాలని, పూర్తి అయిన పనుల బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న శ్మశానవాటిక వివరాలు అందించాలని, శ్మశానవాటిక లేని గ్రామాలకు స్థలాలకు ప్రతిపాదనలు అందించి వెంటనే భూ సేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ జి.రాజకుమారి మాట్లాడుతూ ఎఫ్‌పీఓఎల్ఆర్‌లో మ్యూటేషన్ దరఖాస్తులను నిర్దేశిత కాలంలో పరిష్కరించాలని ఆమె అన్నారు. వన్‌టైం కన్వర్షన్ దరఖాస్తులను ప్రతివారం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పరిష్కరించేలా సబ్ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌లతో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ వర్మ, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు, జిల్లా రెవెన్యూ అధికారి కె. చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వెంకటరామిరెడ్డి, హౌసింగ్ పీడీ సాయినాథ కుమార్, పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య పాల్గొన్నారు.